క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం



కార్యాలయం ఆవరణలో నూతన కార్యవర్గ సభ్యులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారు, గౌరవ అధ్యక్షులుగా సీహెచ్ లచ్చయ్య, చింతాడ సన్యాసి, అధ్యక్షునిగా డి.బాలకృష్ణ, ఉపాధ్యక్షునిగా బి.నరేష్, జనరల్ సెక్రటరీగా ఆర్.భాస్కర్, కోశాధికారిగా వి.రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పి.వెంకటేష్, ఎస్.రామారావు, ఆఫీస్ బేరర్‌గా ఎం.గోవింద్‌తో పాటు బి.సతీష్, ఎస్.శైలజ, ఎం.శ్రీదేవి, భాషాఖాన్, తిరుపతిరావు తదితరులను సభ్యులుగా ఎనుకున్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక సాయం



విద్యార్థినిని పరామర్శిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని డొంకూరు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దున్న సమీర బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఈమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లనున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఉపాధ్యాయుల బృందం శుక్రవారం విద్యార్థినీని పరామర్శించి కొంత ఆర్థిక సాయం చేశారు.

రైల్వే శ్రామిక్ యూనియన్ సభ్యుల సంబరాలు



బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకుంటున్న ఈస్ట్ కోస్టు రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సభ్యులు

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రైల్వే ఉద్యోగుల సంఘం గుర్తింపు ఎన్నికలు ఈనెల 4, 5, 6 తేదీల్లో జరిగాయి. ఇంజినీరింగ్, ఈఎన్‌డబ్ల్యూ, లోకో, ఎలక్ట్రికల్ ఆల్ డిపార్టమెంట్‌లకు చెందిన 673 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ఫలితాలు గురువారం రాత్రి వచ్చాయి. ఈస్ కోస్టు రైల్వే శ్రామిక్ యూనియన్‌పై ఈస్ట్ కోస్టు రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. దీంతో శ్రామిక్ కాంగ్రెస్ కార్యాలయం వద్ద గురువారం రాత్రి ఉద్యోగులు బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు.

వైద్య సేవలపై కమిషనర్ సమీక్ష



వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31వార్డు ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న వైద్య సేవలపై కమిషనర్ నడిపేన రామారావు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మూడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల వైద్య సిబ్బంది పాల్గొన్నారు. రోజు నమోదవుతున్న ఓపీ, అందుతున్న వైద్యసేవలు, ఉన్నటువంటి సౌకర్యాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది పనితీరుని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రెండు అర్బన్ హెల్త్‌సెంటర్లను నిర్మించిందని.. మరొకటి పనులు పూర్తి కావాల్సి ఉందని సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తయిన యూహెచ్‌బీలను సంబంధిత కాంట్రాక్టర్లు మున్సిపాలిటీకి అప్పగించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పురపాలక సంఘం బెల్లుపడ కాలనీలో శుక్రవారం నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తుపదార్థాల వాడుక వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలన్నారు. ఎస్ఐ చిన్నంనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



శునకాలు పీకేస్తున్నాయి!

- భయపెడుతున్న గ్రామ సింహాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు





రోడ్లపై గుంపులుగా కుక్కలు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాహన చోదకులు, బాటసారులను సైతం భయపెట్టి వెంటాడి కరుస్తున్నాయి. పగటి వేళల్లో వీధుల్లో ఆటలాడుకునే చిన్నారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులను కరుస్తూ హడలెత్తిస్తున్నాయి. వెంటాడి కాళ్లను పీకేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు మూగజీవాల చట్టాలు అడ్డువస్తుండటంతో అధికారులు ఈ విషయాన్ని గాలి కొదిలేస్తున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రతీ వీధిలో పది నుంచి 15 వరకు వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. రాత్రి సమయాల్లో అయితే పరిస్థితీ మరీ దారుణంగా ఉంటోంది. మోటారు సైకిళ్లపై వచ్చే వారిని వెంబడిస్తుండడంతో వీటి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ ప్రమాదాలకు గురవుతూ తీవ్ర గాయాల పాలై ఆస్పత్రి పాలవుతున్నారు.

పెరుగుతున్న కుక్క కాటు కేసులు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కొళిగాం, ఈదుపురం, రాజపురం, కవిటి, బొరివంక, మాణిక్యపురం, బెలగాం, ఎంఎస్.పల్లి, కంచిలి, సోంపేట, బారువ, కొర్లాం పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ప్రతీ నెల 60 నుంచి 70 వరకు వ్యాక్సిన్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇవి గుంపులుగా తిరుగుతుండటంతో వీటిని అదుపు చేయడం ఎవరి తరం కావడం లేదు. కుక్కలను పట్టుకోవడానికి చట్టాలు అడ్డువస్తుంటే, కనీసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటి సంతతిని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదు. ఇటీవల కాలంలో కుక్కలకు చర్మ వ్యాధులు అధికంగా వస్తుండటంతో వాటిని చూసే సరికి భయమేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శునకాల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

వెంటాడి కరుస్తున్నాయి..



మోటారు సైకిల్‌పై సాయంత్రం ఆరు దాటిన తరువాత వెళితే చాలు రోడ్లపై ఉండే కుక్కలు వెంటాడి, వేటాడి కరుస్తున్నాయి. దీంతో చాలా మంది ప్రమాదాల భారినపడి మృత్యువు అంచుల వరకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

– సంగారు కేశవరావు, డొంకూరు

చికెన్ సెంటర్ల వల్లే..



ప్రస్తుతం ప్రతీ గ్రామంలో రెండు మూడు చికెన్ దుకాణాలు ఉన్నాయి. కోళ్ల మాసం వ్యర్థ పదార్థాలు తినేందుకు కుక్కలు అధిక సంఖ్యలో రోడ్లపై కాచుకు చూస్తుంటాయి. ఈ సమయంలో ఆ మార్గం గుండా వెళ్లే వారిపై దాడిచేస్తున్నాయి. ముందుగా చికెన్ దుకాణదారులను హెచ్చరించి వ్యర్థ పదార్థాలను పూడిక చేసే విధంగా చేయాలి – సీహెచ్ భోగయ్య, బిన్నుగానిపేట

భిక్షాటనకు వెళ్లాలంటే భయం వేస్తుంది



నేను జముకు కళాకారుడ్ని. రోజూ గ్రామాల్లోకి భిక్షాటనకు వెళ్తుంటాను. ఐదేళ్ల క్రితం వరకు గ్రామాల్లో అక్కడక్కడ కుక్కలు కనిపించేవి. ఇప్పుడు ప్రతీ వీధిలో పదుల సంఖ్యలో దర్శనం ఇస్తున్నాయి. దీంతో నాలాంటి వారు భిక్షాటనకు వీధుల్లోకి వచ్చేందుకు జంకుతున్నారు. కుక్కల భారిన పడి గాయాలపాలైన సంఘటనలు మాకు చాలా ఉన్నాయి.

– మల్లేశు, భిక్షాటన కళాకారుడు

పిచ్చికుక్క స్వైర విహారం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి కనిపించిన వారిపై దాడికి పాల్పడింది. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిపై దాడి చేసింది. అలాగే రోడ్డు పక్కన గాజులు వేయించుకుంటున్న వృద్ధురాలిని గాయపరిచింది. కుక్కను అడ్డుకునే ప్రయత్నం చేసిన యువకుడు కిర్రి శంకర్‌పై కూడా దాడిచేసి తీవ్రంగా కరిచింది. రోటరీ నగర్–1 సమీపంలో మరో నలుగురు వ్యక్తులపై దాడిచేసి గాయపరిచింది. దీంతో కొంతమంది కుక్కను వెంబడించి చంపేశారు. కాగా గాయపడిన వ్యక్తులు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు



ఇచ్ఛాపురం రూరల్: పోలీసు అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు



కంచిలి: పోలింగ్ సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

వజ్రపుకొత్తూరు: వంశధార పలాస సబ్ డివిజన్‌లో నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగుతాయని వంశధార డీఈఈ సుధాకర్ శుక్రవారం తెలిపారు. ప్రతీ నీటి సంఘానికి 12 మంది టీసీలను ఎన్నుకోనున్నారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు ఉంటాయని సుధాకర్ చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో వజ్రపుకొత్తూరు, పలాస, సంతబొమ్మాళి మండలాల్లోని మర్రిపాడు, కవిటి, అమలకుడియా, అంతరకుడ్డ, వీరభద్రాపురం, లక్ష్మీపురం, నగరంపల్లి మేజర్ ఇరిగేషన్లకు సంబంధించి పలాసలో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అలాగే రిట్టపాడు –1, 2 మైనర్ ఇరిగేషన్లకు సంబంధించి పల్లిసారధి ఉన్నత పాఠశాల కేంద్రం ఎన్నికలు జరుగుతాయని డీఈఈ వెల్లడించారు.

ఎన్నికలకు సహకరించండి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని 16 సాగునీటి సంఘాలకు జరగనున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు సహకరించాలని తహసీల్దార్ ఎన్.వెంకటరావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఇచ్ఛాపురం పట్టణ, రూరల్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించి ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రం పరిసరాల్లో 163 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలకు అవగాహన కలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు ఇ.చిన్నంనాయుడు, ఇ.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ భోజరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఏర్పాట్లు

కంచిలి: కంచిలి మండల పరిధిలో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. మండలంలో 17 సాగునీటి సంఘాలకు, 102 టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్ పి.పారినాయుడుకు సూచించారు. శిక్షణ సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్, ఇరిగేషన్ ఏఈ. మధుసూదన్ పాణిగ్రాహి ఉన్నారు.

పలాస మండలంలో..

పలాస: పలాస మండలంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వివిధ గ్రామాల్లో మైనర్, మేజరు నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు పలాస తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్ నీటి సంఘాల పరిధిలో ఉన్న 51 టీసీలకు, వంశధార ఆయకట్టు పరిధిలో ఉన్న నీటి సంఘాలకు సంబంధించి 60 టీసీలకు ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. నీటి సంఘాల పరిధిలో ఉన్న రైతులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

నేడు మండల సమావేశం

పలాస: పలాస మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీవో వసంతకుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతాలు



సామూహిక హనుమత్ వ్రతంలో భక్తులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని కోదండ రామాలయంలో సామూహిక హనుమత్ వ్రతాలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మార్గశిర త్రయోదశిని పురస్కరించుకొని వేకువ జామున పంచామృతాలతో స్వామివారికి భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేసిన అనంతరం సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

మొక్కలు నాటివేత

కాశీబుగ్గ: ప్రతిఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటాలని మందస మండలం కొత్తపల్లి పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం పుట్టినరోజు జరుపుకున్న పదో తరగతి విద్యార్థిని కీర్తనతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. హెచ్‌ఎం ఎస్ గణేశ్వరరావు, ఉపాధ్యాయులు భీమారావు, కిరణ్, అబ్రహాం, రాంబాబు, గోపాలక్రిష్ణ, రమేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 23 మంది ఎంపిక



సోంపేట: జాబ్‌మేళా నిర్వహిస్తున్న పరిశ్రమల ప్రతినిధులు



కాశీబుగ్గ: జాబ్‌మేళలో ఎంపికైన వారికి నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ జవహార్

సోంపేట: నిరుద్యోగ యువత ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బారువ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు అన్నారు. కళాశాల ఆవరణలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించగా 54 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 23 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ, జేకేసీ కోఆర్డినేటర్ బి.రాంబాబు ఉన్నారు.

పలాసలో 18 మంది..

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఐటీఐలోనిర్వహించిన ఉద్యోగ మేళాకు స్పందన లభించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖల సంయుక్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ మినీ జాబ్‌మేళాలో మూడు ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 51 హాజరయ్యారు. వీరిలో 18 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్, కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ రవికుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డి.దిలీప్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

కాశీబుగ్గ: పలాస మండలం ఉలాసపేటకు చెందిన కొవ్వూరు మల్లేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈయన విద్యుత్ శాఖలో దినసరి ఉద్యోగిగా పని చేస్తుండేవారు. దీంతో మల్లేశ్వరరావు భార్యకు పలాస విద్యుత్ శాఖ ఉద్యోగి పినకాన సాయిరాం తదితరులు రూ. ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. పలాస డివిజన్ విద్యుత్ ఉద్యోగుల సంఘ కార్యదర్శి గార రాజారావు, కమ్యూనికేషన్ కార్యదర్శి భాస్కరరావు, లైన్‌మెన్‌లు జోగారావు, కళ్యాణ్, సంపతిరావు, రవికిరణ్, జూనియర్ లైన్‌మెన్ సమీర్ ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

విద్యార్థులకు అవగాహన..



విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ అన్నారు. ఇచ్ఛాపురం మండలం కొళిగాం ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, ఒత్తిడికి గురుకాకుండా ప్రణాళికబద్ధంగా చదివితే సక్సెస్ అనేది మీ ముంగిట ఉంటుందన్నారు. సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, మానసిక ప్రశాంతంగా ఉండాలే తప్పా అఘాయిత్యాలకు పాల్పడవద్దని అన్నారు. ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎ.బి.రాజు, లోపింటి పద్మనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

క్రీడాకారునికి సత్కారం..



పలాస మండలం బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి రాపాక సాహిల్‌కుమార్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్–14 విభాగం క్రికెట్‌లో రెండోసారి పాల్గొని సత్తాచాటాడు. దీంతో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సాహిల్‌కుమార్‌ను ఉపాధ్యాయులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే జూనియర్ కబడ్డీ విభాగంలో కూడా పాఠశాల విద్యార్థులు పలాస మండల గ్రిగ్స్ పోటీల్లో విజయం సాధించడంతో వారిని కూడా అభినందించారు. హెచ్‌ఎం ఎ.వీర్రాజు, పీడీ రామ్‌జీ ఉన్నారు. – పలాస

ఉచిత వైద్య శిబిరం



వజ్రపుకొత్తూరు మండలం గరుడబద్రలో రాగోలు జెమ్స్ అస్పత్రి సౌజన్యంతో సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కొంతమంది రోగులను మెరుగైన వైద్య సేవల కోసం అదే ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని వైద్యులు సూచించారు. వైద్యులు అరుణ్‌కుమార్, ఎ.వెంకటేష్, అనిత, ఎస్.భారతి, వైద్య సిబ్బంది ఎస్.మోహన్ , టి.అప్పలస్వామి, ఎ.అప్పారావు, ఎ.ఈశ్వరరావు, చామంతి ఉన్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

ఫ్యాన్ తిరిగే.. ధాన్యం ఎగిరే..



ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను ఇంటికి తీసుకుపోవాలని రైతులు ఆసక్తిగా ఉన్నారు. దీంతో వరినూర్పు పనుల్లో బిజీ అయ్యారు. పాత సైకిల్ పళ్ల చక్రం, చైను ఆధారంగా చేసిన ఫ్యాన్‌ను ఒకరు తిప్పుతుంటే వచ్చే గాలి ఎదురుగా మరొకరు ధాన్యాన్ని ఎగరబోస్తున్నారు. ఈ దృశ్యం పలాస మండలం దిమిలాడ గ్రామం వద్ద కనిపించగా.. 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది.

– కాశీబుగ్గ

నిధుల దుర్వినియోగంపై విచారణ



డీపీవో గోపి బాలకి వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

కాశీబుగ్గ: మందస మండలం బహడపల్లి పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదు మేరకు టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి గోపీ బాల విచారణ చేపట్టారు. బహడపల్లి గ్రామ కమిటీ సమక్షంలో శుక్రవారం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధులు, పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగిన అవకతవకలపై విచారణ చేశారు. విత్ డ్రా చేసిన రూ.12 లక్షల నగదుతో జరిగిన పనులపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసినట్టు గోపీ బాల చెప్పారు. కాగా నిధుల దుర్వినియోగంపై లోతుగా విచారణ చేయాలని కోరుతూ స్థానికులు వినతి పత్రాన్ని అందించారు. స్థానిక నాయకుడు బొడ్డు ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు సాలిన మాధవరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు సాలిన ఉమాపతి, సాలిన జానకీరావు, సార పురుషోత్తం, కర్రి తాతారావు, రాపాక కేశవరావు, మామిడి కృష్ణారావు, వార్డు సభ్యులు విచారణకు హాజరయ్యారు.